క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలో బుధవారం కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో సేవా శిబిరాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నిర్వహించిన ర్యాలీలో 'ఓటు హక్కు– మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు, ఓటు వేద్దాం.. మంచి నేతను ఎన్నుకుందాం' అంటూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటు నమోదు చేసుకునే విధానం వంటి విషయాలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థినికి పీహెచ్‌డీ పురస్కారం



విద్యార్థిని దొడ్డ భార్గవి

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థి దొడ్డ భార్గవి చేపట్టిన పరిశోధనకు గానూ తమ యూనివర్సిటీ బుధవారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. 'డిజైన్, సింథసిస్ ఆఫ్ నోవెల్ హెటిరో సైక్లిక్ కాంపౌండ్స్ బేస్డ్ ఆన్ సాక్యుబిట్రిల్, పైపరజిన్ అండ్ ఇండజోల్ మోయిటీస్ అండ్ దేయిర్ బయలాజికల్ యాక్టివిటీస్' అనే అంశంపై భార్గవి పరిశోధన చేసిందని తెలిపారు. పీహెచ్‌డీ పొందిన దొడ్డ భార్గవి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్–ఐఐసీటీ)లో పోస్ట్ డాక్టోరల్ ఫెల్లోషిప్‌కు సైతం ఎంపికైందని వెల్లడించారు. చైర్మన్ లావు రత్తయ్య, డీన్లు, అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

నేడు అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు నేడు ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలంలో ఖాళీగా ఉన్న నడింపాలెం ఎస్‌పిఎస్ కేంద్రం, గనికపూడి డీడబ్ల్యూ సెంటర్, పెదనందిపాడు మండలంలోని పెదనందిపాడు బీసీ-1, వట్టిచెరుకూరు మండలంలో వడ్డెరపాలెం సెంటర్లకు గురువారం గుంటూరులోని మహిళా ప్రాంగణం నందు ఉదయం తొమ్మిది గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని కోరారు.

రేపటి నుంచి టీ-20 క్రికెట్ చాంపియన్‌షిప్

తెనాలి: జనాబ్ అబ్దుల్ సత్తార్‌ఖాన్ మెమోరియల్ రాష్ట్రస్థాయి 3వ టీ-20 క్రికెట్ చాంపియన్‌షిప్ ఈనెల 9నుంచి తెనాలిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన డాక్టర్ రియాజ్‌ఖాన్, యువ క్రికెట్ అకాడమీ కోచ్ మాలిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీ క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి క్రీడాకారులకు పురస్కారాలను ఇవ్వనున్నట్టు వివరించారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలోని నార్త్ కేబిన్ వైపు రైలు పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడికి సంబంధించిన వారు ఎవరనేది తెలియలేదు. రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు సీఐ చెప్పారు. మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. మృతుడు పసుపు పచ్చచొక్కా, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలకు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, 9440627546, ఎస్ఐ వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్డ్‌పేటకు చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ (40) అప్పుల బాధ భరించలేక బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

సాయినగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పట్టాభిపురం పోలీసులు బుధవారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 57,440 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయ సదస్సులు.. జనం ఆదరాభిమానాలు

- ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇంటింటికి వెళుతున్న వైఎస్సార్ సీపీ నేతలు
- 'గుండె గుండెకు జగనన్న.. గడప గడపకు కిరణన్న' కార్యక్రమానికి జనం నీరాజనం
- నియోజకవర్గ సమన్వయకర్త బలసానికి పెరుగుతున్న జనాదరణ



ప్రత్తిపాడులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ఐదేళ్ల పాలనలో సాంత్వన పొందిన ఎన్నో గుండెల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ చేయూత ద్వారా ఇంటి ఇల్లాలు ఆర్థిక శక్తిగా మారిన ఆనవాళ్లు పలకరిస్తున్నాయి. రైతు భరోసా పథకం ద్వారా పంట పొలంలో బంగారు వర్షమేసిన కంకుల్లో అన్నదాత చిరునవ్వులు కనిపిస్తున్నాయి. ఇంటి పట్టాతో సొంతింటి కల నెరవేర్చుకున్న నిరుపేదల జీవితాలు కళ్ల ముందే మెదులుతున్నాయి. ఇలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి గుమ్మంలో మెరిసిన నవరత్నాల సాక్షిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆత్మీయ సభలో ఎన్నో గుండెలు తమ భావాలను పంచుకుంటున్నాయి.

రాష్ట్రంలో ఐదేళ్ల పాలన..

ఎక్కడా అవినీతి అనేది లేకుండా నేరుగా ప్రజల వద్దకే ప్రభుత్వం కదిలివెళ్లింది. దళారులు లేరు.. దౌర్జన్యాలు లేవు.. జన్మభూమి కమిటీలు అనే ముఠాలు లేవు. ప్రతి పథకం పేదవాని గుమ్మానికి నేరుగా వెళ్లింది. ఒకటా రెండా.. సుమారు 125 పథకాలు.. పేదల జీవన ప్రమాణాలు పెంచింది. కులం చూడం.. మతం చూడం అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలినాళ్లలో చెప్పిన మాట.. అక్షర సత్యమైంది. ఏ పథకానికైనా పేదరికమే అర్హతగా మారింది. వారి కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు సాధనమైంది. నేడు ప్రత్తిపాడు నియోజకవర్గంలో బలసాని కిరణ్ కుమార్ నేతృత్వంలో చేపడుతున్న ఆత్మీయ సదస్సుల్లో అన్ని సామాజిక వర్గాల వారు మా బతుకులు బాగుండాలంటే మళ్లీ జగన్ బాబు రావాలయ్యా.. అందుకే కిరణ్ కుమార్‌కు మద్దతుగా నిలుస్తామయ్యా అంటూ ముక్త కంఠంతో నినదిస్తున్నారు.

ప్రతి సామాజిక వర్గంతో మమేకం

ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా బలసాని కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించాక నియోజకవర్గంలో 'గుండె గుండెకు జగనన్న –గడప గడపకు కిరణన్న' కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళుతున్నారు. నియోజకవర్గంలోని గుంటూరు రూరల్, వట్టిచెరుకూరు, కాకుమాను, ప్రత్తిపాడు మండలాల్లో పర్యటించారు. అన్ని సామాజిక వర్గాల నేతలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సుమారు వెయ్యి మందికిపైగా బీసీలతో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. సభల్లో వారికి కలిగిన లబ్ధిని ప్రజలు చెబుతున్నారు. దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల వారితోనూ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేశారు. కూడు, గూడు లేని తమకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక పరపతి తీసుకొచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. తమను వెతుక్కుంటూ వచ్చిన కిరణ్ కుమార్ వెంట నడుస్తామని నినదిస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



ఐదేళ్ల కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తుంది. గతంలో ఏదైనా పథకం కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వలంటీరు ఇంటికొచ్చి మరీ కాగితాలు తీసుకెళుతున్నాడు. డబ్బులు నేరుగా మా బ్యాంకులకే వస్తున్నాయి. ఇప్పుడు కిరణ్ కుమార్ వచ్చారు. మా సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– ధర్మారావు, వెంగళాయపాలెం గ్రామం.

ఇంటింటికీ తిరుగుతున్నారు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో ప్రత్తిపాడు సమన్వయకర్తగా బలసాని కిరణ్ కుమార్ వచ్చారు. ప్రతి ఇంటికీ వచ్చి పలకరిస్తున్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా రాసుకుని వెళ్లి మరీ పరిష్కరిస్తున్నారు. మా ప్రాంతంలో విద్యుత్ సమస్య గురించి చెప్పగానే వెంటనే అధికారులకు చెప్పి పరిష్కరించారు. సీఎం జగన్ పాలనలో మేమంతా చాలా లబ్ధి పొందాం. అందుకే కిరణ్ కుమార్ వెంట నడుస్తాం.

– వి.నవీన్‌రెడ్డి, జొన్నలగడ్డ గ్రామం

ప్రజలంతా సీఎం జగన్ వెంటే



నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజలతో మమేకమవుతున్నాం. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నాం. అన్ని వర్గాల నుంచి వైఎస్సార్ సీపీకి అపూర్వ మద్దతు లభిస్తోంది. ఆత్మీయ సదస్సుల ద్వారా ప్రజలకు దగ్గరవుతున్నాం. మరోసారి ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం.

– బలసాని కిరణ్ కుమార్, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త

చేబ్రోలు తహసీల్దారుగా రమాదేవి

చేబ్రోలు: చేబ్రోలు మండల తహసీల్దారుగా రమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న కేవీ గోపాలకృష్ణను బదిలీ చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన రమాదేవిని చేబ్రోలు తహసీల్దారుగా నియమిస్తూ కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన రమాదేవిని రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు అభినందించారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రాంబాబు

పెదనందిపాడు: పెదనందిపాడు వ్యవసాయ పరపతి సహకార సంఘం నూతన అధ్యక్షునిగా నాగులపాడు గ్రామానికి చెందిన పాటిబండ్ల రాంబాబు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం పెదనందిపాడు సొసైటీ కార్యాలయంలో సీఈవో కోండేపాటి భాస్కరరావు వద్ద నుంచి బాధ్యతలు స్వీకరించారు. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన దివ్వి నాగేశ్వరరావు పదవీకాలం జనవరి 30తో ముగిసింది. నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన రాంబాబుకు సొసైటీ సిబ్బంది, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రత్తిపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీవో కె. దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన సమావేశం జరగాల్సి ఉందని, అసెంబ్లీ సమావేశాల కారణంగా సమావేశాన్ని మరుసటి రోజుకు వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు గమనించాలని కోరారు.

'మా ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటాం'





వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును మహిళలకు అందజేస్తున్న బలసాని కిరణ్‌కుమార్, వందలాదిగా హాజరైన డ్వాక్రా మహిళలు

- ఆసరా సంబరాల్లో ముక్తకంఠంతో నినదించిన మహిళామణులు
- డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కులు అందజేత
- వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఉత్సాహపరచిన నియోజకవర్గ సమన్వయకర్త బలసాని

ప్రత్తిపాడు: మా ఓటుతో సీఎం రుణం తీర్చుకుంటాం.. మాతో పాటు మా కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన రుణం తీర్చుకునే సమయం వచ్చింది. రానున్న ఎన్నికల్లో మా ఓటుతో వైఎస్ జగన్ నాయకత్వాన్ని బలపరుస్తాం. అన్నను మరోసారి సీఎంగా గెలిపించుకుంటాం.. అంటూ డ్వాక్రా మహిళలు సభావేదిక సాక్షిగా స్పష్టం చేశారు.

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన ఆసరా సంబరాలకు డ్వాక్రా మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు వందల సంఖ్యలో తరలి వచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళామణులు జేజేలు పలికారు. మహిళలకు నిజమైన ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించిన నాయకుడు జగన్ అని ముక్తకంఠంతో నినదించారు. థాంక్యూ సీఎం సార్.. మేమంతా మీ వెంటే ఉంటామంటూ మహిళాలోకం జయ జయధ్వానాలు చేశారు.

మహిళాభివృద్ధే ధ్యేయం: బలసాని

మహిళాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిర్విరామంగా కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం జి. సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌కు డ్వాక్రా మహిళలు ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపించారు. తొలుత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ ఆసరా ద్వారా గడిచిన నాలుగేళ్లలో సుమారు వంద కోట్ల రూపాయల మేర డ్వాక్రా మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లో మనమంతా జగనన్నకు మద్దతుగా నిలబడాలన్నారు. తనను బలపరిచి ఆశీర్వదించాలని మహిళలను బలసాని కోరారు. మండలంలో 1003 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన డ్వాక్రా రుణమాఫీ నమూనా చెక్కుతో పాటు స్త్రీనిధి కింద 777 మంది మహిళలకు మంజూరు చేసిన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, వైస్ ఎంపీపీలు షేక్ అఫ్రీనా సుల్తానా, తమ్మా రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు గురుగూరి సాయి, మరియరత్తమ్మ, ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ, రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి, సేవాదళ్ జిల్లా కన్వీనర్ మురళీ, సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మారెడ్డి, నర్రారాంబాబు, మహమ్మద్, ఎంపీటీసీలు బూసి సువార్తమ్మ, సుభాషిణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుజ్జుల శివారెడ్డి, ఎంపీడీవో దుర్గాప్రసాద్, స్త్రీనిధి ఏజీఎం చెన్నకేశవులు, మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

హాజరైన డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదకాకాని బాజీబాబా దర్గా చుట్టూ నిర్మించిన ప్రహరీ, ప్రధాన రోడ్డు నుంచి దర్గాలోనికి రూ.1.97 కోట్లతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యతో కలిసి డిప్యూటీ సీఎం ఎస్‌డీ అంజాద్‌బాషా బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో డిప్యూటీ సీఎం ఎస్‌డీ అంజాద్‌బాషా మాట్లాడారు. దర్గా ఈఓ ముక్తార్‌బాబాబాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు జిలానీ, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీటీసీలు షేక్ గుల్జార్, షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, మరియమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభానీ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ నజీర్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, షేక్ ఆరిఫ్, సైపుల్లా, షరీఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన యజుర్వేద పారాయణ మౌఖిక పరీక్ష



ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

పెదకాకాని: శివాలయంలో ఖాళీగా ఉన్న కృష్ణ యజుర్వేద పారాయణం ఉద్యోగానికి బుధవారం జరిగిన మౌఖిక పరీక్ష ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర దేవదాయ శాఖ కార్యాలయం నియమించిన కమిటీ సభ్యులైన వెంకట రామకృష్ణ శర్మ(రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, నెల్లూరు), కె త్రినాథ కళ్యాణ చందు(శ్రీకాళహస్తి దేవస్థానం) ఆధ్వర్యంలో, రాష్ట్ర దేవదాయ శాఖ ఏడీసీ టి చంద్రకుమార్, సత్యనారాయణమూర్తి, ఆలయ ఈవో ఎన్ శ్రీనివాసరెడ్డి ల పర్యవేక్షణలో అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ వేదపారాయణ ఉద్యోగానికి మొత్తం 55 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఇంటర్వ్యూకు 43 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు సంబంధించి ఉత్తీర్ణత చెందిన అభ్యర్థి పేరును రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించి తదుపరి వెల్లడించడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్ రావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈ బైక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: జీపీఎస్ టెక్నాలజీ ద్వారా మొబైల్ కంట్రోలింగ్ సిస్టం రూపకల్పనలో తమ విద్యార్థులు నూతన ఆవిష్కరణల ద్వారా జాతీయ స్థాయిలో కీర్తి పొందడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఐఎస్ఐఈ ఇండియా (ఇంపీరియల్ సొసైటీ ఫర్ ఇన్నోవేటివ్ ఇంజినీర్) ఆధ్వర్యంలో లుమినస్ ఎస్ఐఈపీ ఈ బైక్ ఛాలెంజ్ 2024 పేరుతో మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నందు ఐఈఎస్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు తయారు చేసిన ఈబైక్ ప్రదర్శనకు రెండు అవార్డులు లభించాయన్నారు. ప్రదర్శనలో లైట్ వెయిట్ అవార్డు, ఫ్యూచర్ అవార్డులను సొంతం చేసుకోవటం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులు తయారు చేసిన ఈ బైక్ ఒకసారి ఛార్జ్ చేస్తే ఇద్దరు మనుషుల బరువును తీసుకుని 60 కిలోమీటర్ల వేగంతో సుమారు 80 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్ తెలిపారు. అవార్డులు పొందిన విద్యార్థులను కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ కె చంద్రశేఖర్, డాక్టర్ కృష్ణప్రసాద్, పీ వెంకటమహేష్, ఆర్ఎమ్ వరప్రసాద్‌లు అభినందించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న ఎస్‌హెచ్ఓ విజయచంద్ర

గుంటూరు ఈస్ట్: మతిస్థిమితం లేని బాలుడు పాఠశాల నుంచి తప్పిపోగా పట్టాభిపురం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగడిగుంటకు చెందిన ఎం.ఫణి అనే 16 సంవత్సరాల మతిస్థిమితం లేని బాలుడు జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య పాఠశాలకు వెళ్లి తప్పిపోయాడు. పట్టాభిపురం పీఎస్ కానిస్టేబుల్ భూపతి ఎస్వీఎన్‌కాలనీ పదో లైనులో గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్‌హెచ్ఓ విజయచంద్ర బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సంక్షేమం దిశగా కృషి చేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సుబ్బరామిరెడ్డి

గుంటూరు రూరల్: రైతు సంక్షేమం కోసం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను రైతులకు అందించేవిధంగా రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ సుబ్బరామిరెడ్డి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న సమావేశ మందిరంలో రాష్ట్రంలోని 23 మంది కృషీ విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు, 13 మంది ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు, 26 మంది వ్యవసాయ శాఖలోని డీఆర్‌పీ సభ్యులకు వివిధ విభాగాల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించేందుకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతు స్థాయిలో దిగుబడులు తగ్గకుండా ఉండటం కోసం నూనె గింజలు, అపరాలు, చిరుధాన్యాల పంటలలో దిగుబడిని పెంచేందుకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని ఈ శిక్షణ తరగతుల్లో తెలుసుకోవచ్చన్నారు. పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్ ప్రశాంతి మాట్లాడుతూ విస్తరణ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో సమస్యలను చాలా నిశితంగా పరిశీలించాలని వాటిని నూతన పరిశోధన అంశాలతో తీసుకునే విధంగా తెలియజేయాలని సూచించారు. వేరుశనగలో దిగుబడి పెంచే విషయాలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ ప్రసన్నరాజేష్, పొద్దుతిరుగుడు, కుసుమ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ, అపరాల దిగుబడి పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్ వి రమణ, చిరుధాన్యాలలో సాగును, దిగుబడిని పెంచే విధానాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవిలత, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డిలు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి రామారావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి కరుణాసాగర్, డీన్ డాక్టర్ రమణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఏ మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బి విజయాభినందన, డాక్టర్ జి శివన్నారాయణ పాల్గొన్నారు.

శ్రీ హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్

కాలిలో గడ్డ కట్టిన రక్తాన్ని పెనుంబ్రా పరికరం ద్వారా తొలగింపు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరెడ్డి

గుంటూరు మెడికల్: కాళ్లల్లో రక్తనాళాలు గడ్డకట్టి తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి అత్యాధునిక వైద్య పద్ధతిలో అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడినట్లు శ్రీ హాస్పిటల్‌కు చెందిన ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి చెప్పారు. అరండల్‌పేట డొంక రోడ్డులోని హాస్పిటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒంగోలుకు చెందిన 43 సంవత్సరాల వ్యక్తి కాళ్ల వాపు, నొప్పి, నడవలేకపోవడం, ఇతర అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం తమ హాస్పిటల్‌కు వచ్చినట్లు వెల్లడించారు. వ్యాధిని డీప్ వీనస్ థ్రాంబోసిస్‌గా పిలుస్తారన్నారు. ఇది ఉన్నవారికి ఒక్కోసారి గుండె ఆగిపోయే ప్రమాదం ఉందని, పల్మనరీ థ్రాంబోలిజం వచ్చే అవకాశం ఉన్నట్లు చెప్పారు. కాలిలో రక్తనాళాలు గడ్డకట్టడం ద్వారా వచ్చిన వీనస్ థ్రాంబోసిస్ సమస్యను ఈనెల 3న థ్రాంబోస్ సెక్షన్ చేసి గడ్డలు తొలగించామని తెలిపారు. ఇలాంటి ఆపరేషన్ మొట్టమొదటిసారిగా శ్రీ హాస్పిటల్‌లో చేసినట్లు డాక్టర్ నారాయణరెడ్డి చెప్పారు. ఆపరేషన్ చేసిన రెండురోజుల్లోనే కాలిలో నొప్పి, వాపు తగ్గి సదరు వ్యక్తి నడిచినట్లు వెల్లడించారు. గతంలో ఇలాంటి ఆరోగ్య సమస్యకు హెపారిన్ ఇంజక్షన్ చేసేవారని, తద్వారా 30 శాతం రికవరీ మాత్రమే ఉండేదన్నారు. గుంటూరు ప్రజలకు అత్యాధునిక కార్డియాలజీ సేవలను అందించేందుకు తాము మొట్టమొదటిసారిగా పెనుంబ్రా అనే అత్యాధునిక వైద్య పరికరాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. దీని ద్వారా కాలి నరాల్లో రక్తపు గడ్డలను అతి తక్కువ సమయంలో తొలగించి, గుండెపోటు రాకుండా కాపాడవచ్చని వివరించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. చుట్టుగుంట సెంటర్‌లో ముప్పాళ్ల శివన్నారాయణ మద్యం సీసాలు తరలిస్తుండగా బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి నాలుగు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక

గుంటూరు ఎడ్యుకేషన్: అర్ధ శతాబ్దం తరువాత స్వర్ణోత్సవ కలయిక నిర్వహించుకున్న పూర్వ విద్యార్థులు ఒకనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఆత్మీయంగా సత్కరించుకున్న సంఘటన గుంటూరు నగరంలో జరిగింది. యాభై ఏళ్ల కిందట నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా బుధవారం గుంటూరు నగరంలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో విందులు, వినోదాలతో కాలక్షేపం చేయకుండా జీవితపు చివరి అంచులకు చేరిన తమ గురువును వెతుక్కుంటూ వెళ్లి ఘనంగా సత్కరించారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో 1973–76 బ్యాచ్‌కి చెందిన విద్యార్థుల్లో అధిక శాతం మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులుగా స్థిరపడ్డారు. మరికొంతమంది అనేక ఉన్నత పదవుల్లో పనిచేశారు. సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకున్న వారంతా తొలుత ఉభయ కుశలోపరి నిర్వహించారు. తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రస్తుతం విద్యానగర్‌లో శేషజీవితం గడుపుతున్న రాజనీతి శాస్త్ర విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వై.రత్నారెడ్డి దంపతులను కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంజుల సత్యనారాయణరెడ్డి, వెంకట్రావు, కృపానందం, నరసింహారెడ్డి, నాగరాజు, శౌరమ్మ, చిన్నమ్మ, ఉషారాణి, కృపారావు, సుబ్బారావు, కోటేశ్వరరావు, అప్పారావు, జార్జీ, గాలిబు, హనుమంతరావు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.